క్లుప్తంగా

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

గుడివాడరూరల్: చనిపోయిన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బాటసారులకు, ప్రజల అవసరాలకు ఉపయోగపడే మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ వైస్ చైర్మన్ గోకవరపు సునీల్ అన్నారు. స్థానిక బంటుమిల్లిరోడ్డులోని భీమేశ్వరస్వామి ఆలయం ఎదురుగా శ్రీ గాయత్రి కేటరింగ్ వద్ద చక్కా వెంకటేశ్వరరావు, స్వరాజ్యం జ్ఞాపకార్థం వారి తనయుడు పాపారావు గురువారం ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు దేవరపల్లి కోటి, వైశ్య ప్రముఖులు కొత్త వీరయ్య, తిరివీధి వెంకట సుబ్బారావు, బెజవాడ బసవేశ్వరరావు, వీర వెంకటసత్యనారాయణ, పోకూరి ప్రసాద్, జి.కాంతారావు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం

గుడ్లవల్లేరు: చెత్త సంపద తయారీ కేంద్రాల్లో తయారవుతున్న ఎరువుతో ఆయా పంచాయతీలకు ఆదాయం లభిస్తోందని స్వచ్ఛ భారత్ మిషన్ ఫైనాన్స్ మేనేజర్ విజయశేఖర్ అన్నారు. గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. పంచాయతీ పరిధిలోని చెత్త సేకరణతో తయారయ్యే వానపాముల ఎరువును కొనుగోలు చేసే రైతులు ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.విజయసారథి, గ్రామ కార్యదర్శి జె.నరసింహారావు, సిబ్బంది ఉన్నారు.

గేట్ ర్యాంకర్ సాయి చరణ్‌కు సన్మానం



కైకలూరు: గేట్ ప్రవేశ పరీక్షల్లో కలిదిండి మండలం ఆరుతెగలపాడు గ్రామానికి చెందిన చిలుకూరి సాయి చరణ్ ఇటీవల 9వ ర్యాంకు సాధించాడు. కాకినాడ జేఎన్‌టీయూలో ఇంజనీరింగ్ చదివి హైదరాబాద్‌లో గేట్ కోచింగ్ తీసుకుని తొలి ప్రయత్నంలోనే 9వ ర్యాంకు సాధించినందుకు ఆరుతెగలపాడు హైస్కూల్‌లో గురువారం సాయి చరణ్‌కు పౌర సన్మానం చేశారు. జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పేటేటి స్వర్ణకుమారి, ఎంపీటీసీ పేటేటి రామకృష్ణ, ఉప సర్పంచ్ పీతల రాజు, స్కూల్ హెచ్ఎం ఎ.శ్రీనివాసరావు, సాయి చరణ్ తల్లిదండ్రులు కిషోర్, పల్లవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను సవరణ చట్టం రద్దు చేయాలి

గుడివాడరూరల్: ఆస్తి పన్ను పెంపుదలకు సంబంధించి మున్సిపల్ సవరణ చట్టం 44/2020ను వెంటనే రద్దు చేయాలని ది గుడివాడ రేట్ పేయర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చోడవరపు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఆస్తి పన్ను మదింపునకు అద్దె విలువ కాకుండా ఆస్తి విలువ ఆధారంగా పన్ను విధించడం వలన రిజిస్ట్రేషన్ విలువ పెరిగినప్పుడల్లా ప్రతి సంవత్సరం ఆస్తి పన్ను 15శాతం చొప్పున పెంచుతున్నారని దీనివల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారంలోకి వస్తే ఆస్తిపన్నును సమీక్షిస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోకుండా ప్రజలపై భారం మోపిందన్నారు. వెంటనే దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

67 యూనిట్లకు 730 మందికి ఇంటర్వ్యూలు

గుడ్లవల్లేరు: మండలంలో 67 యూనిట్ల కార్పొరేషన్ రుణాలకు గాను 730 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. స్థానిక గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ టి.విజయసారథి ఆధ్వర్యంలో బీసీ కార్పొరేషన్ అధికారులతో పాటు మండలంలోని వివిధ బ్యాంకర్లు ఈ ఇంటర్వ్యూలను నిర్వహించారు. గురువారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇంటర్వ్యూలు జరిగాయి.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

మండవల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కె.రామలింగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో నూరుశాతం పన్నులు వసూలు చేయాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఏఈ, ఈఓపీఆర్డీ పాల్గొన్నారు.

157 మంది ఎన్యూమరేటర్ల గుర్తింపు

మండవల్లి: స్వయం సహాయక సంఘాల సభ్యుల వారీగా జీవనోపాధి ప్రణాళిక నమోదుకు 1301 స్వయం సహాయక సంఘాలకు 157 మంది ఎన్యూమరేటర్లను గుర్తించినట్లు ఏపీఎం (హెచ్ఆర్) రామోజీ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ 157 మందికి ఒక్కొక్కరికీ 6 నుంచి 8 గ్రూపుల చొప్పున కేటాయించామన్నారు. ఎన్యూమరేటర్లకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి 3 వరకు శిక్షణ నిర్వహించామన్నారు.

రాములోరి అన్న సమారాధన

నిధులు స్వాహా?

- కొన్నేళ్లుగా లెక్కలు చెప్పని ఉత్సవ కమిటీ సభ్యులు
- తప్పుడు లెక్కలు చెప్పి విరాళాల సొమ్ము దోచుకున్న వైనం

గుడివాడరూరల్: అపర భద్రాద్రిగా పేరుగాంచిన గుడివాడ రూరల్ మండలం మోటూరు(గోదావరం) గ్రామంలో వేంచేసియున్న శ్రీసీతారామ స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి రోజు నిర్వహించే అన్నసమారాధన కార్యక్రమ నిధులను గత 15 ఏళ్లుగా ఉత్సవ కమిటీలోని కొందరు సభ్యులు దోచుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సీతారామస్వామి ఆలయం దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఉంది. ఏటా నిర్వహించే నవమి ఉత్సవాలను కూడా దేవదాయ శాఖ అధికారుల సమక్షంలోనే జరుగుతాయి. కానీ నవమి రోజు ఆలయ ప్రాంగణంలో నిర్వహించే అన్నసమారాధనకు కొంతమంది ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ అనుమతి తీసుకోకుండా, ట్రస్ట్ రిజిస్టర్ లేకుండా శ్రీసీతారామస్వామి తిరుకల్యాణ మహోత్సవ అన్నసమారాధన సంఘం పేరిట చందా పుస్తకాలు ముద్రించి భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. 2009 నుంచి ఇప్పటి వరకు రూ.70 లక్షలకు పైగా సేకరించి సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారనేది ఆరోపణ. దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన వారిపై ఆలయ ఈవో పోలీసు కేసు పెట్టినట్లు సమాచారం. అధికారుల సహకారం లేకుండా ఆ వ్యక్తులు రాములోరి నగదు స్వాహా చేయలేరని, దీనిపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకుని, దిగమింగిన సొమ్మును రికవరీ చేయాలని కోరుతున్నారు.



మోటూరు సీతారాములస్వామి ఆలయం

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం..

ఈ విషయమై దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌ను వివరణ కోరగా నిధులు స్వాహా జరిగినట్లు తమకు ఫిర్యాదు అందిందని, దీనిపై ఇప్పటికే పోలీసు కేసు పెట్టామన్నారు. అన్నసమారాధన కార్యక్రమం దేవస్థానం తరఫున చేయాలని ప్రైవేటు వ్యక్తులు చేయడానికి వీల్లేదన్నారు. గత కొన్నేళ్లుగా అన్నసమారాధన కార్యక్రమాన్ని గ్రామస్తులే నిర్వహించే వారని, ఆలయం తరఫున రూ.10 వేలు ఖర్చులకు ఇచ్చేవాళ్లమన్నారు. దేవస్థానం పేరు వాడుకుని కొందరు అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అన్ని విషయాలపై విచారణ చేసి బాధ్యులపై చట్టపరమైన తీసుకుంటామన్నారు.

ప్రొటోకాల్ పాటించరా?

- జిల్లా కలెక్టర్ వస్తే ఎంపీపీకి సమాచారం ఇవ్వరా?
- ఎంపీడీవో సీతామహాలక్ష్మి తీరుపై ఆగ్రహం
- సమావేశం నుంచి ఎంపీటీసీ సభ్యులు బాయ్‌కాట్



ఎంపీడీవో తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీపీ గోగం సురేష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

పెదపారుపూడి: గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు స్థానిక ఎంపీటీసీ సభ్యులకు ప్రొటోకాల్ ప్రకారం కనీస సమాచారం ఎందుకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎంపీటీసీ సభ్యులకు గురువారం మండల సర్వసభ్య సమావేశం నుంచి బాయ్‌కాట్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని గుర్విందగుంట గ్రామంలో కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డు శంకుస్థాపనకు తనను ఎందుకు పిలువలేదని గుర్విందగుంట ఎంపీటీసీ సభ్యుడు వేమూరి మోహన్ ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మిని ప్రశ్నించారు. దీంతో ఎంపీడీవో ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వాల్సిన అవసరం తనకు లేదని, పంచాయతీ తీర్మానం చేసిందని మాట దాటవేశారు. పక్కనే ఉన్న ఎంపీపీ గోగం సురేష్ బుధవారం మహేశ్వరం గ్రామానికి జిల్లా కలెక్టర్ బాలాజీరావు వస్తే ఎంపీడీవో గాని, తహసీల్దార్ గాని తనకు ఎందుకు సమాచారం అందించలేదని నిలదీశారు. తమకు సంబంధం లేదని వారు చెప్పటంతో ప్రభుత్వ కార్యక్రమాలకు ఎంపీపీకి సమాచారం అందించాల్సిన బాధ్యతా లేదా అని మండిపడ్డారు. ఎంపీడీఓ వైఖరిని నిరసిస్తూ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు ఒక్కసారిగా సమావేశం నుంచి బాయ్‌కాట్ చేశారు. అనంతరం కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఎంపీడీవో ఏకపక్ష వైఖరిపై తీర్మానం చేసి కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళతామని వైస్ ఎంపీపీ పానుగుపాటి రజిని, ఎంపీటీసీలు చిగురుపాటి అశోక్ కుమారి, మద్దాలి జ్యోతి, జుజ్జువరపు రాజమ్మ, జాజుల శ్రీనివాసరావు తెలిపారు. ప్రజాప్రతినిధులకు కనీస విలువ ఇవ్వని ఎంపీడీవో తమకు వద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీటీసీలతో పాటు పాములపాడు, నాగాపురం గ్రామాల సర్పంచ్‌లు కూడా సమావేశం నుంచి బయటకు వచ్చేశారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



బొడ్డపాడులో సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

తోట్లవల్లూరు: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పాటుపడుతోందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని బొడ్డపాడులో రూ.52.30 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంటు రోడ్లు, రచ్చబండ ప్రారంభోత్సవం, శ్మశానవాటిక షెడ్డు, ప్రహరీ నిర్మాణ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన నిర్వహించారు. సిమెంటు రోడ్ల నిర్మాణంతో ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయని అన్నారు. సర్పంచ్ మూడే శివశంకర్, మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ సీతారాంబాబు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ కనగాల వెంకట సత్యనారాయణ, ఉప సర్పంచ్ కె.శివశంకర్, ఎంపీడీఓ రవికాంత్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు శరాబందిరాజు, సుబ్బారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్టి నమూనాలపై రైతులకు అవగాహన

జిల్లా వనరుల కేంద్రం డీటీసీ కె.జ్యోతిరమణి



రైతులకు అవగాహన కల్పిస్తున్న జ్యోతిరమణి

గుడివాడరూరల్: పంట పొలాల్లో మట్టి నమూనాల సేకరణపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం డీటీసీ కె.జ్యోతిరమణి అన్నారు. స్థానిక నాగవరప్పాడు రైతుసేవా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మట్టి నమూనాల సేకరణపై మండల వ్యవసాయశాఖ అధికారి బోలెం అనంతలక్ష్మి ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో గురువారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మట్టి నమూనాలు సేకరించడం వల్ల నేలలో సారవంతంతో పాటు ఏ పంట సాగు చేస్తే ఏ ఫలితాలు వస్తాయో తెలుస్తాయన్నారు. దీనివల్ల అధిక దిగుబడి వచ్చే మేలైన వరి విత్తనాలను నాటుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతులు పొలాల్లో వ్యర్థాలు తగలబెడితే నేలలో ఉన్న పోషకాలు నశించి సూక్ష్మ జీవులు మరణిస్తాయని, సేంద్రియ కర్బనమ్ తగ్గిపోవడంతో పాటు పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు కె.శ్రీనివాసరావు, డీఆర్‌సీ ఏవో బి.పద్మజ, ఏఈవో డి.ప్రదీప్, వీపీఏలు, బేతవోలు, నాగవరప్పాడు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి

మొవ్వ మండల క్రైస్తవ సమాఖ్య డిమాండ్



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మొవ్వ మండల క్రైస్తవ సమాఖ్య పాస్టర్‌లు, సభ్యులు

మొవ్వ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ సత్వరమే జరపాలని, క్రైస్తవులకు రక్షణ కల్పించాలంటూ మొవ్వ మండల క్రైస్తవ సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం పెద్ద ఎత్తున శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక అనుమానాలకు తావిస్తున్న ప్రవీణ్ మృతిపై అనుమానాలను ప్రభుత్వం నివృత్తి చేయాల్సి ఉందన్నారు. దేశంలో మత కలహాలు తక్షణమే అరికట్టాలని, క్రైస్తవ ప్రార్థనాలయాలపై, క్రైస్తవులపై దాడులను అరికట్టాలని కోరుతూ ర్యాలీగా కూచిపూడి, పెదపూడి ప్రధాన కూడలి నుంచి మొవ్వ తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మస్తాన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పాస్టర్లు వి.పరిశుద్ధ రాజు, బిషప్ అప్పికట్ల ఇమ్మానుయేల్, ఫెలోషిప్ నాయకులు పోలిమెట్ల విజయ్‌కుమార్, మార్క్ ప్రసన్నకుమార్, అశోక్, ఏసుదాస్, సుందర్ రావు, జీవన్ రావు, సుధాకర్ ఐసీసీ జిల్లా నాయకులు హనోక్, సీపీఎం నాయకుడు శీలం నారాయణ రావు, వైఎస్సార్ సీపీ నాయకుడు బడే గౌతం, అంబేడ్కర్ వాదులు, పలువురు ప్రజా సంఘాల నాయకులతో పాటు వందల సంఖ్యలో క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.

కరకట్టపై బస్‌షెల్టర్ ప్రారంభం

తోట్లవల్లూరు: కృష్ణా కరకట్టపై దాతలు బస్‌షెల్టర్ నిర్మించటం అభినందనీయమని గురివిందపల్లి సర్పంచ్ ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్ అన్నారు. స్థానిక కృష్ణా కరకట్టపై బాసింశెట్టి రంగారావు జ్ఞాపకార్థం కుమారుడు బాసింశెట్టి సీతారామాంజనేయులు, కృష్ణకుమారి దంపతులు రూ.2.40 లక్షల వ్యయంతో ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్ నిర్మించారు. నూతనంగా నిర్మించిన బస్‌షెల్టర్‌ను దాత బంధువు ఉమ్మడిశెట్టి సూరి ప్రభాకర్, సర్పంచ్ ఉదయభాస్కర్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి జ్యోతి, ఉప సర్పంచ్ పోతురాజు నాగజయరాజు, ఉమ్మడిశెట్టి సాంబశివరావు, పులి వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

పసుమర్రు చెరువులో ఉపాధి పనులు



పసుమర్రు(పామర్రు): మండలంలోని పసుమర్రు గ్రామ పరిధిలోని సుమారు మూడు ఎకరాల చెరువులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సురేష్ మాట్లాడుతూ పంట కాలువలలో పూడిక తీత పనులతో పాటు చెరువు పూడిక తీత పనులను కూడా ప్రారంభించామని చెప్పారు. పసుమర్రు చెరువులో ఉపాధి కూలీలు తవ్వు పనులు నిర్వహించారని, తొలుత చెరువు గట్లు పటిష్ట పర్చే విధంగా చెరువు తవ్వి వచ్చిన మట్టిని గట్లపై వేస్తారని అన్నారు. మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీలలో 1550 మంది ఉపాధి పనులలో పాల్గొన్నారని చెప్పారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

పామర్రు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకుంటే సమాజం సస్యశ్యామలంగా మారుతుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక కంచర్లవానిపురంలో శ్రీ విజయ గణపతి స్వామి వారి ఆలయ నిర్మాణానికి గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాల నిర్మాణం వలన ఆ ప్రాంతం అంతా శాంతియుతంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

మైనార్టీ వెల్ఫేర్ అధికారి అబ్దుల్ రబ్బాని



మైనార్టీల అంజుమన్, షాదీఖానాలను పరిశీలిస్తున్న రబ్బాని

గుడివాడరూరల్: మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, ఆ దిశగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచనలతో గుడివాడలో మైనార్టీల సంక్షేమానికి జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి అబ్దుల్ రబ్బాని అన్నారు. ఓల్డ్ బైపాస్‌రోడ్డులోని అంజుమన్ భవనాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను కూటమి నాయకులు, మైనార్టీలతో కలసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రబ్బాని మాట్లాడుతూ అంజుమన్ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంచనాలు రూపొందించిన తర్వాత ఎమ్మెల్యే రాము ఆధ్వర్యంలో షాదీఖానా నిర్మాణ పనులు కూడా త్వరలో ప్రారంభమయ్యేలా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సతీష్‌చంద్ర, ఏఈలు రాజేష్, శివాజీ, కూటమి నాయకులు షేక్ సర్కార్, షేక్ జానీషరీఫ్, షేక్ ఇబ్రహీం, సయ్యద్ మున్వర్, సయ్యద్ జబీన్, మహ్మద్ రఫీ, రహీం, రబ్బానీ, కరీముల్లా పట్టపు చిన్న పాల్గొన్నారు.

రెండు పెన్షన్ విధానాలు రద్దు చేయాలి

కేంద్ర పెన్షనర్ల సంఘ సభ్యుల నిరసన



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పెన్షనర్ల సంఘ సభ్యులు

గుడివాడరూరల్: కేంద్ర ప్రభుత్వం రిటైర్ అయిన వారిని రెండు భాగాలుగా విభజించడం వల్ల ఉద్యోగ విరమణ పొందిన వారికి తీవ్ర నష్టం జరుగుతుందని, ఇలాంటి పద్ధతులను వెంటనే రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర పెన్షనర్ల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద గురువారం పెన్షనర్ల సంఘాల ఆధ్వర్యంలో నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐబీఎస్ఎన్ఎల్ పిడబ్ల్యూఏ గుడివాడ బ్రాంచ్, రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్, బ్యాంకర్స్, ఎల్ఐసీ, పోస్టల్ యూనియన్ల ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు చింతలూరి సత్యనారాయణ, మరలా వెంకటేశ్వరరావు, సముద్రాల వెంకటేశ్వరరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు భట్లపెనుమర్రు జెడ్పీ పాఠశాల వజ్రోత్సవం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన పింగళి వెంకయ్య, పోలవరపు శేషయ్య విగ్రహాలు

భట్లపెనుమర్రు(మొవ్వ): జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జన్మస్థలమైన మొవ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామంలో వేలాది మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన శ్రీ పోలవరపు శేషయ్య జిల్లా పరిషత్ పాఠశాల 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 5వ తేదీన వజ్రోత్సవానికి సిద్ధమవుతోంది. 1949–50వ సంవత్సరంలో ప్రారంభమైన ఈ పాఠశాలను 1958లో పోలవరపు శేషయ్య సహకారంతో రూ.25వేలతో అభివృద్ధి చేశారు. పూర్వ విద్యార్థులు వజ్రోత్సవం ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పింగళి వెంకయ్య, పోలవరపు శేషయ్య విగ్రహాల ఆవిష్కరణ, నాటి గురువులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా పిలుపు నిచ్చారు.

కూటమి ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకం

పమిడిముక్కల: వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతిచ్చిన కూటమి ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకమని మరోసారి రుజువైందని లంకపల్లి ఎంపీటీసీ సభ్యుడు ఎం.సజ్జాద్ అలీ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎం.దియానత్ అలీ అన్నారు. వీరంకిలాకులో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ బిల్లును వ్యతిరేకించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్తం

- **బాకీ చెల్లింపుపై ఘర్షణ**

ముదినేపల్లిరూరల్: కిరాణా షాపులో అప్పుగా తీసుకున్న మొత్తాన్ని సకాలంలో చెల్లించలేదంటూ వ్యక్తిపై దాడి చేసిన ఘటన ముదినేపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లికి చెందిన గూడవల్లి కోటయ్య, జగదాంబ కిరాణా షాపు నిర్వహిస్తుండగా ముదినేపల్లికి చెందిన ఈడే పెద్దేశ్వరరావు అప్పుగా సరుకులు కొనుగోలు చేశాడు. ఈ మొత్తాన్ని రెండు విడతలుగా చెల్లించడంలో జాప్యం జరిగిందని జగదాంబ ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. కోటయ్య, జగదాంబ కలిసి పెద్దేశ్వరరావుపై దాడి చేశారు. పెద్దేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

- **ఆక్రమణల తొలగింపుపై తుది నోటీసులు**

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని సర్వే నెంబర్ 38/1 లోని పసుమర్తి వారి ధర్మ చెరువు పోరంబోకు, 38/2 ఆర్ అండ్ బీ రోడ్డు మార్జిన్‌లలోని ఆక్రమణలు తొలగించాలంటూ గ్రామ పంచాయతీ అధికారులు గురువారం ఫైనల్ ఆర్డర్ (నోటీసులు) జారీ చేశారు. ఆక్రమణల తొలగింపులకు వారం రోజులు సమయం కేటాయించారు. బార్లపూడి రోడ్డులో కూచిపూడి రామాలయం దగ్గర నుంచి మొవ్వ రోడ్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వరకు గల 48 మంది ఆక్రమణదారులకు ఫైనల్ నోటీసు అందజేశారు.

- **ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ**

కైకలూరు: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా పాఠ్య, నోటు పుస్తకాలను ప్రిన్సిపాల్ ఎస్.శాంతి జ్యోతి గురువారం పంపిణీ చేశారు. ఈ నెల 7 నుంచి పదో తరగతి పరీక్ష రాసిన హాల్ టిక్కెట్‌ను పరిగణనలోకి తీసుకుని మొదటి సంవత్సర ఇంటర్మీడియెట్ తరగతుల్లో ప్రవేశం కల్పిస్తామన్నారు.

- **మొవ్వ ఎస్‌టీవోగా రవి**

మొవ్వ: మొవ్వ సబ్ ట్రెజరీ కార్యాలయ అధికారిగా గురువారం ఎం.రవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన్ను ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు కలసి అభినందించి సత్కరించారు.

- **విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడికి సత్కారం**

ముదినేపల్లి రూరల్: మండల విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన వంజరపు వెంకట రమణను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) గురువారం సత్కరించారు. మండలంలోని చిగురుకోటలో జరిగిన ఒక కార్యక్రమంలో వెంకటరమణను అభినందిస్తూ పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ ముదిరాజ్ సంఘం విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, వైఎస్సార్ సీపీ కైకలూరు మండల అధ్యక్షుడు శింగంశెట్టి రాము, తదితరులు పాల్గొన్నారు.

- **విలేకరిపై దాడి కేసులో నిందితులను అరెస్ట్ చేయాలి**

ముదినేపల్లి రూరల్: కైకలూరు వైస్ ఎంపీపీ ఉప ఎన్నిక సందర్భంగా విలేకరిపై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యుడు వి.విజయకుమార్, ముదినేపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ నాగరాజు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ముదినేపల్లిలో ర్యాలీ నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

- **హైస్కూళ్లుగా రెండు యూపీ స్కూళ్లు**

ముదినేపల్లి రూరల్: మండలంలోని వైవాక, సింగరాయపాలెం యూపీ స్కూల్స్‌ను హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఈ ఉత్తర్వులు అమలులోకి వస్తాయని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ తెలిపారు. వైవాక గ్రామానికి చెందిన విద్యార్థులు హైస్కూల్ విద్యను అభ్యసించేందుకు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి వరకు వెళ్లాల్సి వస్తోంది.

- **ప్రకృతి సేద్యంపై అవగాహన ర్యాలీ**

ముదినేపల్లి రూరల్: ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ మండలంలోని సింగరాయపాలెంలో విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి, ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యతను గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామ్మోహనరావ తదితరులు పాల్గొన్నారు.

- **శంకరంపాడులో సీసీ కెమెరాలు ఏర్పాటు**

నందివాడ: మండలంలోని శంకరంపాడు గ్రామంలో ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

7న ఉచిత మెగా వైద్య శిబిరం

కైకలూరు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న కైకలూరు విజయలక్ష్మి థియేటర్ వెనుక మెడికేర్ ఆస్పత్రి వద్ద ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని మెడికేర్ సంస్థల స్థానిక నిర్వాహకులు బండారు నాగరాజు గురువారం చెప్పారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. బీపీ, షుగర్, హెచ్‌బీఏ ఒన్‌సీ, కొలెస్ట్రాల్, ఈసీజీ, థైరాయిడ్, ఎముకల పరీక్షలను డాక్టర్ కలపాల జ్ఞానస, ప్రముఖ ఎముకల వ్యాధి నిపుణుడు డాక్టర్ తోట కార్తీక్ ఉచిత సేవలు అందిస్తారన్నారు. షుగర్ పరగడుపున శాంపిల్స్ ఇవ్వదలిచిన వారు ఉదయం 6 గంటలకు రావాలన్నారు.